క్లుప్తంగా

గుంతలమయంగా రోడ్డు



కోనరావుపేట: మండలంలోని నాగారం–పల్లి మక్త ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రెండు గ్రామాల మధ్య ఉన్న మట్టిరోడ్డు గుంతలమయంగా మారడంతో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు నడవలేని విధంగా ఈ రోడ్డు తయారైంది. వెంటనే అధికారులు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్న వెంకటి

గంభీరావుపేట: మండలంలోని రాజేశ్వర్‌రావు నగర్‌లో దాదాపు రూ. 40వేల సొంత ఖర్చుల తో కాంగ్రెస్ నేత పిట్ల వెంకటి వీధిదీపాలు ఏర్పాటు చేయించాడు. నిన్న మొన్నటి వరకు గ్రామంలో గేట్‌వాల్స్, పైపులైన్ మరమ్మతు పనులు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు విరాళాలు అందజేశారు. ఎస్సై ఆంజనేయులు గ్రామంలో సమావేశం నిర్వహించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో ఇప్పటివరకు రూ.లక్షా 5వేలు అందించగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మరిన్ని విరాళాలు సేకరించి పనులను పూర్తయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు అన్నదానం



వేములవాడ: తొలి ఏకాదశి పండుగ రోజు సైతం బుధవారం మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు వందమంది పేదలకు అన్నదానం చేశారు. గత 1178 రోజులుగా నిరంతరం పేదలకు అన్నదానం చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు మధు మహేశ్, సత్తయ్య, సంతోష్, నక్క వేణు, శ్రీనివాస్, సగ్గు రాహుల్ తెలిపారు.

నేడు రైతు వేదికల్లో సంబరాలు

చందుర్తి: మండలకేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ సంబరాలను గురువారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి దుర్గారాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3 గంటల వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు భారీ తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

బోయినపల్లి: మండలంలో రూ.లక్షలోపు రుణాలు ఉన్న 1839 మంది రైతులకు గురువారం రుణమాఫీ కానుందని ఎంఏవో ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా కొదురుపాక రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో సందేశం రైతులు వినేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రైతులు కొదురుపాక రైతువేదికకు చేరుకోవాలని ఎంఏవో కోరారు.

వేములవాడఅర్బన్: రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ చేయనుండగా గురువారం వేములవాడ మండలం రైతు వేదిక వద్ద సంబరాలు నిర్వహిస్తున్నట్లు వేములవాడ మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ తెలిపారు. రైతులు మధ్యాహ్నం మూడు గంటలకు రైతు వేదిక వద్దకు రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంల అగ్రహారం శివారులోని సిరిసిల్ల– కరీంనగర్ ప్రధాన రహదారిలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన పటాన్, ధనుంజయ్ అగ్రహారంలోని ప్రికాస్ట్, మొక్కలకు సిమెంట్ కుండీలను చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం వేములవాడ నందికమాన్ వైపు ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



ముస్తాబాద్ : అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ముస్తాబాద్ : మద్దికుంటలో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో తొలి ఏకాదశి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. మండలకేంద్రంలోని శ్రీ శివకేశవుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దికుంట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల అనంతరం భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతం చేశారు. పోతుగల్, ఆవునూర్ రామాలయాల్లో పూజలు చేశారు. గూడెంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ముస్తాబాద్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప, వీరాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి హారతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాగారంలోని కోదండ రామస్వామి ఆలయం, మల్కపేటలోని రామాలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ కల్యాణ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పంచామృతాలతో స్వామిని అభిషేకించిన అనంతరం దాసాంజనేయ స్వామికి సింధూరం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, చదుర గణేశ్, నాగరాజు, శంకర్, అంజయ్య, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో తొలి ఏకాదశి జరుపుకున్నారు. ఇంటింటి పిండి వంటలు చేసుకొని ఆరగించారు. రైతులు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



సిరిసిల్ల కల్చరల్: సిరిసిల్లలో పీరీల ఊరేగింపు



వేములవాడ అర్బన్: నాంపల్లిలో ..



కోనరావుపేట: బావుసాయిపేటలో ..

సిరిసిల్లకల్చరల్: మొహర్రం పండుగను బుధవారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆటోనగర్, కుమ్మరి గల్లీ తదితర ప్రాంతాల్లో పీరీలను ఊరేగించారు. పలువురు ముస్లింలు ఈ వేడుకలో పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో మోహర్రం వేడుకల్లో భాగంగా పీరీలను ఊరేగింపు చేశారు. పీరీలతో ఇంటింటికి తిరుగుతూ ఊదు, దస్తీ, బెల్లం సమర్పించారు.

కోనరావుపేట: కోనరావుపేట, కొలనూర్, బావుసాయిపేట, మల్కపేట, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు పీరీలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించగా, మహిళలు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మత సామరస్యానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ హైదర్ అన్నారు. మండలకేంద్రంలో పీర్ల పండుగ సందర్భంగా షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మౌలానా సైదుర్ రహ్మాన్, అబ్దుల్ ఖదీర్, షేక్ అబుబకార్, సలీమ్, ఇమామ్ అక్రమ్ రాజా, గౌస్, ఖుష్నవాజ్, గులామ్ మహ్మద్, ఇలియాస్ రాజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలో మొహర్రం వేడుకల సందర్భంగా కొండాపూర్, పోతుగల్, గోపాల్‌పల్లె, గూడెం తదితర గ్రామాల్లో పీరీలను ఊరేగించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం పీరీలను సమీప కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గంభీరావుపేట: మండలంలో మొహర్రం వేడుకలను ముస్లింలు ఘనంగా జరిపారు. పీరీలను వీధులగుండా ఊరేగింపు చేపట్టారు.

మహాలక్ష్మీ ఆలయంలో అఖండ భజన



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

చందుర్తి: మండలకేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. భక్తమండలి సభ్యులు, భక్తుల భజనలతో దేవాలయ ప్రాంగణం హోరెత్తింది. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అమ్మవారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేశ్ అఖంబ భజనలో పాల్గొని భజన చేశారు. ఆనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ కమిటీ చైర్మన్ శాలువాతో ఘనంగా సన్మానించారు. చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ సర్పంచ్ గొట్టే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశం, నాయకులు పులి సత్తయ్య, హన్మయ్యచారి, బీజేపీ పార్టీ జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పోంశెట్టి రాకేశ్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆనంతరం వీరిని భజన మండలి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు రాజూరి, పులి సత్తయ్య, డిష్ రాజు, లింగాల మల్లయ్యలతో పాటు 20 మంది సభ్యులు పాల్గొని భజనలు చేశారు.

ముస్తాబాద్ ఎస్సై బాధ్యతల స్వీకరణ



ముస్తాబాద్: ముస్తాబాద్ ఎస్సైగా చిందం గణేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై శేఖర్‌రెడ్డి కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా దోమకొండ ఎస్సైగా పనిచేస్తున్న గణేశ్‌ను ముస్తాబాద్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై గణేశ్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైకి, ఏఎస్సై రమణ, హెచ్‌సీలు రాజేందర్, భూమయ్య, బాలనర్సయ్య, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తరచూ సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వోల్టేజీ, హైవోల్టేజీతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. హై వోల్టేజీతో ఇటీవల మండల కేంద్రంలో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఇకపై విద్యుత్ సరఫరాలో సమస్యలుండవని ఏఈ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌లను బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కేడీసీసీ చైర్మన్ కొండూరి రవీందర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు బంక్‌ల ద్వారా దూరభారం తగ్గనుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కేడీసీసీ బ్యాంకు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్షలోపు రుణమాఫీ ప్రకటనపై హర్షం



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతులకు ఈనెల 18న లక్షలోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేటలో వారు మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రుణమాఫీ చేయలేక చేతులేత్తేసిందన్నారు. తొందరలోనే రైతు భరోసా సైతం అందించనున్నట్లు తెలిపారు. మండలంలో గురువారం సాయంత్రం రైతులతో కలిసి పెద్దఎత్తున ర్యాలీ తీయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, గంట బుచ్చాగౌడ్, చెన్ని బాబు, రాంరెడ్డి, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్, కోరెం గ్రామాల్లో ఆయాగ్రామాల కుర్మ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పస్క బీరప్ప బోనాల వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. మొదట ఆలయంలో బోనాలు సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం సామూహిక వన భోజనాలకు తరలారు. కార్యక్రమంలో జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, కుర్మ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంబు మహేశ్, ఐలేందర్, సాగర్, మహేందర్, నర్సయ్య, కొమురయ్య, రవి, శ్రీకాంత్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడిగా నవాబ్‌ను నియమిస్తూ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్ బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాహెబ్ మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నియమించడం పట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్‌కు నవాబ్ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, దత్తాద్రిగౌడ్, రాజేందర్, రాజునాయక్, బండారి బాల్‌రెడ్డి, రఫిక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



గంభీరావుపేట - నర్మాల వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



డ్రైనేజీలో పెరిగిన పిచ్చిమొక్కలు

- దోమలు, పందుల స్వైరవిహారం
- మురుగుకాల్వల్లోనే పేరుకుపోతున్న చెత్త
- మూలనపడ్డ ఫాగింగ్ యంత్రాలు
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

గంభీరావుపేట: పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీకాలం ముగిసి నాలుగు నెలలు కావొస్తుంది. కాగా గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధిచెంది పలు వ్యాధలబారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. వారానికోసారైనా ఫాగింగ్ కనిపించడం లేదు. గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఫాగింగ్ మిషన్ చెడిపోయి మూలనపడి ఉంది. వానాకాలంలోనైనా ఫాగింగ్ పరికరాలకు మరమ్మతులు చేయించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిధులు లేవని బాగు చేయించడం లేదని దాటవేస్తున్నారు. వార్డుల్లోని డ్రైనేజీలు గడ్డి, చెత్తాచెదారంతో నిండి కనిపిస్తున్నాయి. దీంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని పలుగ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం అధికారులు ఉండే మండలకేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే పల్లెల్లో పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి గ్రామాల్లో వారానికోసారి ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫాగింగ్ చేయాలి



రాత్రయితే దోమల బెడద తీవ్రంగా ఉంది. దోమలు కుట్టడంతో దద్దుర్లు, మంటలు వస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. మురుగుకాల్వలు శుభ్రంచేసి ఫాగింగ్ చేయాలి.

– రాచర్ల పార్థసారథి శర్మ, గంభీరావుపేట

ప్రత్యేక దృష్టిసారించాలి



పంచాయతీ అధికారులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి. గ్రామంలో దోమలు, కుక్కలు, కోతుల బెడద తీవ్రమైంది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దోమల నియంత్రణకు స్ప్రే చేయాలి.

– దోసల చంద్రం, గంభీరావుపేట

అవగాహన కల్పిస్తున్నాం

ఫాగింగ్ మిషన్ చెడిపోయింది. రెండు, త్వరలోనేల పరికరాలను బాగుచేయిస్తాం. డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నాం. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే ఫాగింగ్ ప్రక్రియ చేపడుతాం.

– అశోక్, ఇన్‌చార్జి ఈవో, గంభీరావుపేట

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

సిరిసిల్లక్రైం: అత్యవసర సమయాల్లో ప్రజలు 100కి డయల్ చేసి సమాచారం అందించాలని పట్టణ సీఐ కృష్ణ ప్రజలకు సూచించారు. బుధవారం పట్టణంలోని పద్మనగర్‌లో పోలీస్ మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అమాయక ప్రజలను సైబర్ నేరగాళ్లు ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారన్నారు. చరవాణికి వచ్చే అపరిచిత సందేశాలకు స్పందించవద్దన్నారు. సైబర్ క్రైమ్స్‌తో పాటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల పెరిగిన డ్రగ్స్ వినియోగంపై ప్రజలు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వాహనదారుల ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

కోళ్లు అపహరణ

కోనరావుపేట (వేములవాడ): మండలంలోని రామన్నపేట, సుద్దాల గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు గొర్లు, కోళ్లు అపహరించుకుపోయారు. రామన్నపేటకు చెందిన న్యాలకొండ భూంరెడ్డి, సుద్దాలకు చెందిన ఉప్పుల భూమయ్యల షెడ్లు గ్రామ శివారులో ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఉప్పుల భూమయ్యకు చెందిన రూ.లక్ష విలువైన గొర్లు, న్యాలకొండ భూంరెడ్డికి చెందిన 25 నాటుకోళ్లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్సై ఆంజనేయులు విచారణ చేపడుతున్నారు.

బాలుడికి గాయాలు

వీర్నపల్లి: రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. గర్జనపల్లికి చెందిన న్యాత అభినయ్ బైక్‌పై జవహర్‌లాల్ నాయక్‌తండాకు వెళ్లి వస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్రగాయాలుకాగా ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ ఆస్పత్రికి, అక్కడినుంచి కరీంనగర్‌కు తరలించారు.